క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

తాడూరు/ఊర్కొండ: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి సాయిరమేశ్‌కుమార్ తెలియజేశారు. రైతు బీమాకు దరఖాస్తు చేసుకునే విధానంపై ఆయా క్లస్టర్ల వారీగా ఉన్న ఏఈఓలకు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. 18–59 వయస్సు ఉన్న వారు వచ్చే నెల 5వ తేదీ వరకు కొత్తగా వచ్చిన పాస్‌పుస్తకాల జిరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాపుస్తకం, నామినీ ఖాతా పుస్తకంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన ఆర్‌ఎం



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో కొంత కాలంగా శిథిలావస్థలోని బస్టాండ్‌ను గురువారం ఆర్టీసీ జిల్లా ప్రాంతీయ అధికారి శ్రీదేవి, కొల్లాపూర్ డీఎం రాజేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బస్టాండ్ చుట్టూ ఉన్న కిరాణ దుకాణాల యాజమానులను పిలిపించి వారితో మాట్లాడారు. దుకాణాదారులు వారి వివరాలు తీసుకొని కొల్లాపూర్‌కు రావాలని, దుకాణాలు తీసేసి కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. అభివృద్ధి పరంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

శ్యాంసుందర్‌కు సన్మానం

కోడేరు: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్యాంసుందర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి జంతు శాస్త్రంలో పరిశోధన చేయడంతో పీహెచ్‌డీ పట్టా అందుకున్నందుకు కళాశాల ప్రిన్సిపాల్ ఉమాయత్ర, మోసిన్, ప్రజ్ఞాదేవి, మంజుల, లక్ష్మయ్య, రఘునందన్, స్వామినాథ్, తుమ్మిదిని, మల్లేష్, తదితరులు ఆయన్ను అభినందించి శాలువాతో సన్మానించారు.

అమ్మవారికి పూజలు

చారకొండ: ఆషాడమాసం సందర్భంగా మండల కేంద్రంలో వాసవి వనిత చారకొండ గోల్డ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆంజనేయ మినీ ఫంక్షన్‌హాల్‌లో మహిళలు అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చేతులకు గోరింటాకు అలంకరించుకుని, ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో క్లబ్ అధ్యక్షుడు పావని, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరా ఏర్పాటు

పెద్దకొత్తపల్లి: కల్వకుర్తి నుంచి సోమశిల మీదుగా కొత్తగా ఏర్పాటు చేస్తున్న 167 నేషనల్ హైవే కొత్త రోడ్డు నిర్మాణం కోసం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుడివద్ద నేషనల్ హైవే అధికారులు సీసీ కెమెరాను ఏర్పాటు చేసి ఒక రోజు రోడ్డుపై వెళ్లే వాహనాల వివరాలను సేకరించేందుకు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తి రూరల్: మండల పరిధిలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కల్వకుర్తి ప్రింట్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వినతి అందజేశారు. వెంకటయ్య, కార్తీక్, శ్రీధర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో కొల్లాపూర్ రాజకీయాలపై చర్చ

పెద్దకొత్తపల్లి: ఉస్మానియా యూనివర్సిటీలో కొల్లాపూర్ రాజకీయాలపై యూనివర్సిటీ తెలంగాణ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం ఓయూ, జేఏసీ కొల్లాపూర్ రాజకీయాలపై చర్చ జరిపినట్లు ఓయూ పట్టభద్రుల నిరుద్యోగ సంఘం అధ్యక్షుడు మండ్ల రవి, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ తెలిపారు. 30 ఏళ్లుగా కొల్లాపూర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా రాజకీయ నాయకులు రాజకీయ స్వార్థాలకు ఉపయోగిస్తున్నారని చర్చించారు. అభివృద్ధి మరిచి కొత్త, పాత రాజకీయ నాయకులు ఎన్నికలపైనే దృష్టి సారిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వీరికి బుద్ధి చెప్పేందుకు తాము ప్రచారం నిర్వహిస్తామన్నారు. నిరంజన్, భరత్ పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని 10 టైర్స్ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికకు గురువారం నామినేషన్ ప్రక్రియ ప్రారంభించారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో అధ్యక్షుడి, ఉపాధ్యక్షుడి ఎన్నికల కోసం నామినేషన్లు స్వీకరించారు. అధ్యక్ష పదవికి రహీం, యాదయ్య, గౌస్ నామినేషన్ వేశారు. ఉపాధ్యక్ష పదవులకు నరేందర్, చంద్రమౌళి నామినేషన్ వేశారు. నామినేషన్లు ఎవరూ ఉపసంహరించుకోలేదని ఈ నెల 16న ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల పరిశీలకుడు మన్సూర్‌ఖాన్, సుధాకర్ చెప్పారు. మొత్తం 78 మంది సభ్యులు ఉన్నారని వీరంతా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

'సాక్షి' నెట్‌వర్క్ :వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కొల్లాపూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. కిషన్ నాయక్, కృష్ణయ్య, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

● రైతుల వ్యతిరేకి, రైతుల సంక్షేమం నోచుకోని వ్యక్తి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం అచ్చంపేట సబ్‌స్టేషన్ ఎదుట నిర్వహించిన నిరసన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి శవయాత్ర నిర్వహించి చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 24గంటల విద్యుత్ ఇస్తుంటే ఓర్వలేక కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, పి.మనోహర్, రాజిరెడ్డి, ఏ.రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి పట్టణంలోని 33/11 సబ్‌స్టేషన్ ఎదుట గురువారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు అన్యాయం చేసేలా మాట్లాడారన్నారు.

రైతులను పట్టించుకోని గత ప్రభుత్వాలు..

● గతంలోని ప్రభుత్వాలు ఎన్నడూ రైతులను పట్టించుకోలేదని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం కల్వకుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాష్ట్రాన్ని రావణ కాష్టంలా చేసేందుకు కుట్రలు చేస్తుందని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులపై తన మనసులోని నిజాన్ని బయటపెట్టారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. అదేపని చేస్తుందని, అందుకే ఆ విషయాన్ని బహిర్గతం చేశారని అన్నారు. సమావేశంలో కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ విజయ్, మున్సిపల్ చైర్మన్ సత్యం, కల్వకుర్తి ఎంపీపీ మనోహర, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి పాల్గొన్నారు.



అచ్చంపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు



కల్వకుర్తి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న చైర్మన్ సత్యం తదితరులు

ఇంకుడు గుంతల పరిశీలన



గుంతకోడూరులో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తాడూరు: మండలంలోని గుంతకోడూరులో నిర్మించిన ఇంకుడు గుంతలను గురువారం ఎంపీడీఓ గంగమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శి రామస్వామి ఈ ఇంకుడుగుంతల నిర్మాణంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామంలోని డ్రెయినేజీల చివరి స్థలంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై శ్రద్ధ కనబరచాలని, ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని కార్యదర్శులకు అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రతి రోజు ఉదయమే గ్రామానికి చేరుకుని ప్రజల నుంచి వివిధ సంస్థల నుంచి వచ్చే పన్నులను వందశాతం వసూలు చేయాలని సూచించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



కొల్లాపూర్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రుడు

కొల్లాపూర్: పాఠశాలల్లో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్ వెబ్ సైట్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంఈఓ చంద్రుడు సూచించారు. గురువారం కొల్లాపూర్‌లోని బాలికల హైస్కూల్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఓతో పాటు జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, ఏఎంఓ ఫరీదుద్దీన్ మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు అందించాలని సూచించారు. హెచ్‌ఎంలు రఘువర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, నిరంజన్, సీఆర్‌పీలు పానుగంటి వెంకటస్వామి, అలీ, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ..

కోడేరు: మండలంలో నార్యనాయక్ తండా, మైలారం, తాగూరు తండా పాఠశాలలను ఎత్తం కాంప్లెక్స్ హెచ్‌ఎం నిర్మల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అర్థమయ్యేలా విద్యను అందించాలన్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

● ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: ప్రత్యేక రాష్ట్రం తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడటంతో విద్యా ప్రమాణాలు పెరిగాయని, విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లం మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వట్టెంలో రూ.50 లక్షలతో పాఠశాల అదనపు గదులు, రూ.68 లక్షలతో ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్ ప్రహరీ శంకుస్థాపన, రూ.12 లక్షలతో యాదవ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. వెల్గొండలో రూ.3.20 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి ఆంగ్లంలో మాట్లాడటమే కేసీఆర్ పాలనకు నిదర్శనమని, రాష్ట్రంలో రైతులకు, వృద్ధులకు, దళితులకు, బీసీలకు, దివ్యాంగులకు పెళ్లిళ్లు చేయలేని ఆడపిల్లల తల్లుల వంటి వివిధ వర్గాల ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వట్టెం సర్పంచ్ అమృతరెడ్డి, ఎంపీటీసీ తిరుపతిరెడ్డి, వెల్గొండ సర్పంచ్ కుర్వమ్మ తదితరులు పాల్గొన్నారు.



వట్టెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నిరసన సెగ..

మండలంలోని వట్టెంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై నిరసన తెలిపారు. వట్టెంలో ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు అదనంగా రూ.లక్ష ఇప్పిస్తానని గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న గ్రామస్తులను ఎమ్మెల్యే పర్యటనకు దూరంగా ఉంచి అడ్డుకున్నారు.

వయోజన విద్యపై వీఓఏలకు శిక్షణ

ఉప్పునుంతల: మండలంలోని గ్రామైక్య సంఘాల వీఓఏ(బుక్ కీపర్లకు) వయోజన విద్యపై ఐకేపీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘంలోని ప్రతి సభ్యురాలును అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా శిక్షణ ఇస్తామని డీపీఎంలు అరుణదేవి, శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మొత్తం 793 స్వయం సహాయక మహిళా సంఘాల్లో దాదాపుగా మూడు వేలకు పైగా నిరక్షరాస్యులు ఉన్న మహిళలను అక్షరాస్యులుగా మార్చడానికి వీఓఏలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సైదులు, జైహింద్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలో వీఓఏలకు అడల్ట్ ఎడ్యుకేషన్‌పై గురువారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. చదువు రాని మహిళలకు అక్షరాలు గుర్తు పట్టి చదవడంతో పాటు వారు సంతకం చేసేలా శిక్షణ ఇవ్వాలని అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి మహ్మద్ నూమాన్ అన్నారు. ఐకేపీ అధికారులు శ్రీహరి, మారు, నాగరాజు, మంగమ్మ, యాదమ్మ, వెంకటేశ్వరమ్మ, తిరుపతమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం అరుణాదేవి

ఇసుక టిప్పర్ పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పట్టణానికి చెందిన రామకృష్ణారెడ్డి ఎలాంటి అనుమతి లేకుండా తన టిప్పర్‌లో ఉప్పునుంతల మండలం నుంచి ఇసుకను నింపుకుని నాగర్‌కర్నూల్ తరలిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి మండల పరిధిలోని రాకొండ గ్రామ సమీపంలో పోలీసులు టిప్పర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రామకృష్ణారెడ్డిపై కేసు నమోదు చేసి రూ.10 వేల జరిమానా విధించామన్నారు.

సారా తయారు చేస్తే చర్యలు

వెల్దండ: సారా తయారు చేసిన ముగ్గురు వ్యక్తులను గురువారం ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవికుమార్ మాట్లాడారు. సారా తయారు చేసినా.. విక్రయించినా.. చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల పరిధిలోని అంతిరెడ్డిపల్లి, తుమ్మలకుంటతండాలో ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్, దీలిప్‌రెడ్డి దాడులు చేశారు. కృష్ణారెడ్డి, నర్సిరెడ్డి నుంచి 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. తుమ్మలకుంటతండాకు చెందిన బాల్యానాయక్ వద్ద 120 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

చేపల చెరువులో విషప్రయోగం

బల్మూర్: మండల కేంద్రం నల్లచెరువులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం విష ప్రయోగం చేయడంతో చేపలు మృతిచెందినట్లు మత్స్యకారులు వాపోయారు. ఈ చెరువును కొంత కాలంగా ఓ వ్యక్తికి లీజ్‌కు ఇవ్వగా.. పది రోజుల కిందట గడవు ముగిసింది. గురువారం చెరువులోని చేపలు చనిపోయి నీటిపై తేలి ఉన్నాయి. విషప్రయోగం జరిగినట్టు అనుమానిస్తున్నట్లు మత్స్యకారులు తెలియజేశారు. ఈ సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు వివరించారు.

నాయకుల పరామర్శ

మన్ననూర్: జంగాల కాలనీకి చెందిన హన్మమ్మ మృతిచెందడంతో వృద్ధాప్యంలోని భర్త గడ్డం గురువయ్య అనాథగా మిగిలారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాజేంద్రప్రసాద్, వెంకటయ్య, రామలింగయ్య, శ్రీను పాల్గొన్నారు.

టీడీపీ ఇంటింటి ప్రచారం

తెలకపల్లి: మండల కేంద్రంలో టీడీపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీపతిరావు ఆధ్వర్యంలో తెలకపల్లిలో ఇంటింటికీ తిరిగి టీడీపీని బలోపేతం చేయాలని కోరారు. కొప్పుల రమేష్, ఎండి జాఫర్, తుమ్మ కురుమయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి



కొల్లాపూర్ సమావేశంలో అధికారులు

కొల్లాపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షణ్ –2023 అంశాలపై సమావేశం నిర్వహించారు. ఎంపీపీ భోజ్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి డీపీఓ కృష్ణ, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ ఊశన్న హాజరై ప్రసంగిచారు. క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య అంశాలను అధికారులు పరిశీలించాలన్నారు. పంచాయతీల రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓలు చెన్నమ్మ, రామయ్య, ఎంపీఓ భరత్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తెలకపల్లి: గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. గురువారం మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో పంచాయతీ కార్యదర్శులకు, సెర్ప్ ఉద్యోగులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్వచ్ఛ సర్వేక్షన్‌పై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, హరితహారంలో భాగంగా మొక్కలు నాటాలని వాటిని కాపాడాలని సూచించారు. నాటిన ప్రతిమొక్కకు చుట్టూ కంచె వేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు ఎంపీడీఓ భాస్కర్, ఎంపీ వెంకటయ్య, ఏపీఓ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని అమలు చేయాలి

బిజినేపల్లి: పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సీపీఎస్ ఉద్యోగులు గురువారం పోస్టర్ విడుదల చేశారు. పాత పింఛన్ సంకల్ప రథయాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్నారని, ఈ యాత్రను ఉద్యోగులంతా కలిసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, భీమయ్య, భాస్కర్‌గౌడ్, వెంకటరమణ, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రావు, హరీష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ఆయా ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పీరాజేందర్ రెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నాగభూషణ్ తదితరులు ఉన్నారు.



ఉప్పునుంతల: రైతు వేదిక వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

రథయాత్ర వాల్‌పోస్టర్ విడుదల..

ఉప్పునుంతల: ఉద్యోగులందరికీ సీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్‌తో గురువారం వాల్‌పోస్టర్లను స్థానిక తహసీల్దార్, ఎమ్మార్సీ, ఎంపీడీఓ తదితర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట విడుదల చేశారు. గోపాల్‌నాయక్, రాజేశ్వర్‌రెడ్డి, వినోద్, ఆంజనేయులు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇంటింటికీ కేంద్ర పథకాలను వివరించాలి

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వివరించాలని బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని పోతేపల్లి, అల్లంతోటబావితండా గడప గడప తిరుగుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించారు. అనంతరం కరప్రతాలను అందజేశారు. జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, రామస్వామి, రామకృష్ణ ఉన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు



సిలోనిబావితండాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దండ: మండల పరిధిలోని సిలోనిబండతండాలో గురువారం సఖి కేంద్ర ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు సమావేశంలో లీగల్ కౌన్సిలర్ సరిత, పారా మెడికల్ రాజేశ్వరి వివరించారు. సఖి అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరుగుతున్న సందర్భంగా వారికి సఖి ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు వచ్చినా.. మహిళలు వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు 181కు, సఖి సెంటర్ నాగర్‌కర్నూల్ 9951940181 కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. మంగ్లి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

కల్వకుర్తిరూరల్: సీఎం సహాయనిధి పేద, మధ్య తరగతి ప్రజలకు వరం అని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు అన్నారు. గురువారం హైదరాబాద్‌లో కల్వకుర్తి మండలం లింగసానిపల్లికి చెందిన కొండయ్యకు రూ.22 వేలు, ఎల్లికల్‌కి చెందిన రాఘవేందర్‌కు రూ.21 వేలు, అప్పారెడ్డిపల్లికి చెందిన శివలీలకు రూ.23 వేలు, సురేందర్‌కు రూ.16 వేల సీఎం సహాయ నిధి చెక్కులను ఎంపీ రాములు అందజేశారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెంకటాపూర్‌కి చెందిన అంజనమ్మకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును గురువారం మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ అందజేశారు.

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లికి చెందిన కె.శివలీల గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు సహకారంతో మంజూరైన రూ.23 వేల చెక్కు గురువారం ఎంపీ కార్యాలయంలో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.



చెక్కు అందజేస్తున్న విజయ్‌గౌడ్ తదితరులు

సాయం చేసే వారిని మరవొద్దు..

ఊర్కొండ: సాయం చేసే వారిని మరవొద్దని ఎమెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని మళ్లి అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మండలంలోని జకినాలపల్లికి చెందిన ముస్తఫకు మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం ఆయన అందజేశారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో రాత్రి వేళలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ గుండె పోటుతో గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. దీంతో పాఠశాల సిబ్బంది రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

రైతుల కోసమే కాంగ్రెస్



బిజినేపల్లిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బిజినేపల్లి: రైతుల కోసం చిత్తశుద్ధితో పనిచేసేది కాంగ్రెస్ పార్టీయేనని, అలాంటి పార్టీపై బీఆర్‌ఎస్ అర్థం లేని ఆరోపణలు చేసి ప్రజల్లో విష బీజాలు నాటడానికి యత్నిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ యువ నేత హరీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజేందర్‌రెడ్డి, సత్యం, బురయ్య, విష్ణు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా మంగనూర్‌కి చెందిన కాంగ్రెస్ నాయకులు గురువారం ఉదయం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కటికె శ్రీను, మాసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టండి..

పెంట్లవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది ఏళ్లుగా పరిపాలిస్తున్న రైతులకు ఇచ్చిన ఏ ఒక్కమాట నెరవేర్చలేని ప్రభుత్వం బీఆర్‌ఎస్ ప్రభుత్వమని, వీటిని పట్టించుకోకుండా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ రాష్ట్ర వ్యాప్తంగా దహనం చేయడం సరికాదని పెంట్లవెల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మదుగం నర్సింహయాదవ్ అన్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

మోసం చేసిన బీఆర్‌ఎస్..

కల్వకుర్తిరూరల్: ఎన్నికల సందర్భంగా రూ.లక్ష రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ రుణమాఫీ చేయకుండా బీఆర్‌ఎస్ రైతులను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారం మానుకోవాలన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



బిజినేపల్లిలో..



కోడేరులో మాట్లాడుతున్న బీఎస్పీ మండల అధ్యక్షుడు దర్గస్వామి

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీ ఉద్యోగులను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చేపడుతున్న సమ్మె కొనసాగుతుంది. గురువారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సామూహిక భోజనాలు చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం...

వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామపంచాయతీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగం శశిధర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు, పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రం కోసం రాత్రి, పగలు కష్టపడుతున్నారని, అలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం కనీస గౌరవ వేతనం ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. పాండు, శ్రీకాంత్ రావు, ఎండి నిజాముద్దీన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ నేతల సంఘీభావం..

కొల్లాపూర్‌లో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు బీఎస్పీ నేతలు సంఘీభావం ప్రకటించారు. పసుపుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తాడూరులో నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు